# శభాష్ టీచర్...!

- నిరుపేద విద్యార్థి చదువుకు అండ
- రూ.80 వేల ఆర్థిక సహాయం అందజేత

**నేలకొండపల్లి, ఆగస్టు 3 ప్రజా జ్యోతి :** ఓ నిరుపేద విద్యార్థి ఉన్నత చదువుల కు ఉపాధ్యాయురాలు అండగా నిలిచి ఆదర్శంగా నిలిచింది. మండలంలోని రాయగూడెంలో గత ఏడాది పదో తరగతి లో అత్యంత ప్రతిభ కనపరిచిన విద్యార్థి కె.పృథ్వీ చరణ్ కు ఆ పాఠశాల ఉపాధ్యాయురాలు బాసటగా నిలిచింది. పేదరికం వలన విద్య ఆగకూడదని



2 లో...


జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## ఖమ్మం

మంగళవారం | 4 | ఆగస్టు | 2026 ♦ పేజీలు : 7




# వైద్య కళాశాల, యంగ్ ఇండియా స్కూల్ పనులు వేగవంతం చేయాలి

- వైద్య కళాశాల పనులను పూర్తి చేసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించేందుకు సిద్ధం చేయాలి
- హాస్టళ్లు సెప్టెంబర్‌లో, అడ్మిన్ బ్లాక్ అక్టోబర్‌లో, అన్ని పనులు డిసెంబర్ నాటికి పూర్తి చేయాలి
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులకు అందుబాటులో ఉండాలి

**రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్,చేనేత జౌళి శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు**

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ప్రభుత్వ వైద్య కళాశాల, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువు లోగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ,మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు అధికారులను ఆదేశించారు.సోమవారం రఘునాథపాలెంలోని ప్రభుత్వ వైద్య కళాశాల, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను మంత్రి తుమ్మల నాగేశ్వర రావు జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, సిపి సునీల్ దత్

మిగతా 2 లో...

# తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలి...



- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- ఆగస్టు 1 నుంచి 7 వరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు
- మొదటి ఆరు నెలల వరకు శిశువుకు తల్లిపాలే సంపూర్ణ ఆహారం
- తల్లిపాల ప్రాధాన్యంపై విస్తృత అవగాహన కల్పించాలి
- తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి :** ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహిస్తున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను జిల్లా వ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన అత్యుత్తమ ఆహారమని తెలిపారు. శిశువు పుట్టినప్పటి నుంచి మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లి పాలు మాత్రమే పట్టించేలా

మిగతా 2 లో...

# మరమ్మతులకు నోచుకోని ముచ్చర్ల ఎక్స్ రోడ్ టు ఏన్కూర్ ఆర్ అండ్ బి రోడ్డు

- రోడ్డు పూర్తిగా దెబ్బ తినడంతో ప్రతిరోజు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు
- ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఆర్ అండ్ బి రోడ్డు



2 లో...

# పాలు, పెరుగు, నెయ్యి షాపుల వైపు కన్నెత్తి చూడని అధికారులు!

- కల్తీకి చెక్ పెట్టి.. స్వచ్ఛమైన పాల ఉత్పత్తులు అందేలా చర్యలు తీసుకోవాలని నగర ప్రజల డిమాండ్

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి**

నగరంలో విచ్చలవిడిగా సాగుతున్న కల్తీ పాలు, పెరుగు, నెయ్యి విక్రయాలు.నాణ్యతా ప్రమాణాల తనిఖీలను పూర్తిగా విస్మరించిన ఆహార భద్రతా అధికారులు రసాయనాలతో కూడిన పాలు తాగి అనారోగ్యం పాలవుతున్న చిన్నారులు,వృద్ధులు.కల్తీ రాయుళ్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి,షాపులను సీల్ చేయాలని పౌర సమాజం డిమాండ్. నగరంలో పాలు, పెరుగు, నెయ్యి అమ్మకాలు జరిపే షాపులు, డెయిరీ విక్రయ



కేంద్రాల వైపు సంబంధిత అధికారులు కన్నెత్తి కూడా చూడకపోవడం పట్ల నగర ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యావసర ఆహార పదార్థమైన పాల ఉత్పత్తుల్లో కల్తీ విచ్చలవిడిగా జరుగుతున్నా ఆహార భద్రతా యంత్రాంగం నిద్రమత్తులో ఉండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**అధికారుల ఉదాసీనత – కల్తీ రాయుళ్లకు వరంగా మారిన తీరు:**

నగరంలోని ప్రతి వీధిలోనూ

మిగతా 2 లో...

## మరమ్మతులకు నోచుకోని ముచ్చర్ల ఎక్స్ రోడ్ టు ఏన్కూర్ ఆర్ అండ్ బి రోడ్డు



**కామేపల్లి , ఆగస్టు 3 ప్రజాజ్యోతి** ముచ్చర్ల ఎక్స్ రోడ్ నుండి ఏనుకూరు వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు గుంటలమయం కావడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు తక్షణమే మరమతు చేయాలని సిపిఎం మండల నాయకుడు బాదావత్ శ్రీను ప్రభుత్వ సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ఈ రహదారి దయనీయస్థితిలో ఉందని రోడ్డు మరమ్మతుల కోసం సిపి ఆధ్వర్యంలో అనేక ఆందోళనలు నిరసనలు నిర్వహించడంతో పాటు సంబంధిత అధికారులకు పలుమార్లు వినతి పత్రాలు అందజేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు . రోడ్డు పూర్తిగా దెబ్బ తినడంతో ప్రతిరోజు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారని ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదానికి గురై కాళ్లు చేతులు ఇరగొట్టుకుంటున్నారని తెలిపారు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ రహదారిని ఇకనైనా అధికారులు వెంటనే మరమ్మతు చేసి ప్రజలను సురక్షిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు . లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలను సేకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమంలో చేపట్టి సంబంధిత అధికారులు నిలదీస్తామని బాధావత్ శ్రీను హెచ్చరించారు.

## శభాష్ టీచర్...!

(మొదటి పేజీ తరువాయి... )

...సరస్వతీ పుత్రుడు కు ఉన్నత విద్య ను అందించేందుకు హిందీ ఉపాధ్యాయురాలు వి.మాధవీలత ముందుకొచ్చింది. ఉన్నత చదువుల కోసం నేనున్నాను అంటూ ఉపాధ్యాయురాలు దాతృత్వం ను చాటుకుంది. ఆ విద్యార్థి ఇంటర్ చదువుల కోసం రూ.80 వేల నగదు ను సోమవారం ఆర్థిక సహాయం `అందించారు. ఉపాధ్యాయురాలను పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీ.వెంకటేశ్వర్లు, సుంతరమోని నాగార్జున, బెల్లంకొండ సత్యనారాయణ, జీ.రాజు, బీ.నాగేశ్వరరావు, బీ.తిరుమలప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలి...

(మొదటి పేజీ తరువాయి... )

ప్రతి కుటుంబానికి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ ఆరు నెలల కాలంలో శిశువు ఎదుగుదల, అభివృద్ధికి, రోగ నిరోధక శక్తికి అవసరమైన అన్ని పోషకాలు తల్లిపాలలోనే లభిస్తాయని అన్నారు.ఎక్స్‌క్లూజివ్ బ్రెస్ట్ ఫీడింగ్ అంటే బిడ్డకు ఆరు నెలలు నిండే వరకు తల్లిపాలు తప్ప మరే ఇతర ఆహారం లేదా పానీయం ఇవ్వక పోవడమేనని తెలిపారు. ఈ కాలంలో నీరు, పైపాలు, పాలపొడి లేదా ఇతర ఆహార పదార్థాలు ఇవ్వడం వల్ల శిశువుకు అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందని, వైద్యుల సూచన లేకుండా పాల పొడి లేదా డబ్బా పాలను వినియోగించరాదని సూచించారు.ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా జిల్లా స్థాయి, ప్రాజెక్టు స్థాయి, అంగన్ వాడీ కేంద్రాల స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గర్భిణులు, బాలింతలు, కుటుంబ సభ్యులకు తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన కల్పిస్తూ ప్రతి శిశువుకు మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని అన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు, గర్భిణులు బాలింతలతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పరాస్ కుమార్, డిఆర్ఓ సిహెచ్ రామ్మూర్తి, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి ఎ.ప్రమీల, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, పోషణ్ అభియాన్ సిబ్బంది, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వైద్య కళాశాల, యంగ్ ఇండియా స్కూల్ పనులు వేగవంతం చేయాలి









(మొదటి పేజీ తరువాయి... )

లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.పనుల పురోగతిని సమీక్షించి అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను దశలవారీగా పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక (షెడ్యూల్) సిద్ధం చేయాలని సూచించారు. వైద్య కళాశాల ప్రహరీ గోడ, హాస్టల్, అంతర్గత రహదారులు పూర్తి చేయాలని, అవసరమైన నిర్మాణ పనులకు సంబంధించిన రివైజ్డ్ ఎస్టిమేట్స్‌కు నిరంతరం ఫాలోఅప్ చేసి త్వరితగతిన ఆమోదాలు పొందాలని అధికారులను ఆదేశించారు.బాలికల హాస్టల్ నిర్మాణాన్ని సెప్టెంబర్ 1 నాటికి పూర్తి చేయాలని, విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహతో టెలిఫోన్‌లో మాట్లాడి ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనుల పూర్తి కోసం అదనంగా రూ.64 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. నిర్మాణ పనులు తుది దశలో ఉన్నాయని, ప్రధానంగా విద్యుత్, మౌలిక సదుపాయాల పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని, నిధులు మంజూరైతే పూర్తి చేసి కళాశాలను ప్రారంభించే అవకాశం ఉంటుందని వివరించారు.ముందుగా గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్‌కు సంబంధించిన విద్యుత్ పనులను పూర్తి చేసి విద్యార్థుల వినియోగానికి సిద్ధం చేయాలని, సెప్టెంబర్‌లో హాస్టళ్ల నిర్మాణం, అక్టోబర్‌లో అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ పనులు పూర్తి చేసి, డిసెంబర్ చివరి నాటికి అన్ని నిర్మాణాలను పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి స్పష్టం చేశారు.ఖమ్మంలో ముఖ్యమంత్రి కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో అప్పటిలోగా అన్ని పనులను పూర్తి చేసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. నిర్మాణ పనులకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే జిల్లా కలెక్టర్, తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. అలాగే వైద్య శాఖ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి వైద్య కళాశాల పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి, మొత్తం 17 బ్లాకులు, పేరెంట్స్ లాంజ్, కిచెన్, డైనింగ్ హాల్‌తో పాటు అన్ని నిర్మాణాలను నాణ్యతతో పూర్తిచేయాలని ఆదేశించారు.ముఖ్యంగా హాస్టళ్లు, అకడమిక్ బ్లాకులు, అంతర్గత రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణాన్ని పూర్తిచేసి సంబంధిత శాఖకు అప్పగించాలని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా అన్ని పనులను సమయానికి పూర్తి చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస చారి, ఆర్డీఓ శ్రీనివాస్, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, వైద్య శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పాలు, పెరుగు, నెయ్యి షాపుల వైపు కన్నెత్తి చూడని అధికారులు!

(మొదటి పేజీ తరువాయి... )

పుట్టగొడుగుల్లా వెలిసిన పాల విక్రయ కేంద్రాలలో నాణ్యతా ప్రమాణాలు ఎలా ఉన్నాయో తనిఖీ చేసే నాథుడే కరువయ్యాడు. అధికారులు క్రమం తప్పకుండా ఆకస్మిక తనిఖీలు చేపట్టకపోవడంతో కల్తీ వ్యాపారులు అడ్డూఅదుపు లేకుండా రెచ్చిపోతున్నారు. స్వచ్ఛమైన పాలు అని చెప్పి, రసాయనాలు కలిపిన కృత్రిమ పాలను అమ్ముతూ ప్రజల ప్రాణాలతో వ్యాపారం చేస్తున్నారు.

**ఆరోగ్యాలతో చెలగాటం:**

చిక్కటి పాల కోసం, నాణ్యమైన నెయ్యి కోసం ఎక్కువ ధర చెల్లిస్తున్నప్పటికీ ప్రజలకు కల్తీ పదార్థాలే ఎదురవుతున్నాయి.పాలు చిక్కగా ఉండటానికి స్టార్చ్, డిటర్జెంట్లు, సింథటిక్ పౌడర్లు, యూరియా వంటి ప్రమాదకర రసాయనాలను ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.పెరుగు, నెయ్యి ఉత్పత్తులలో నాణ్యత లేని పామాయిల్, డాల్డా, ఇతర రసాయనాలు కలపడం వల్ల జీర్ణకోశ వ్యాధులు, కిడ్నీ సమస్యలు, గుండె సంబంధిత రోగాలు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

**ఒరిజినల్ పాలు మాత్రమే అమ్మేలా చర్యలు తీసుకోవాలి:**

సాధారణ ప్రజలు తాము కొనుగోలు చేసే పాలు నిజమైనవా లేక రసాయనాల కల్తీనా అని తెలుసుకోలేక తీవ్ర అయోమయానికి గురవుతున్నారు.వ్యాపారుల లాభార్జన ఆశకు అమాయక ప్రజల ఆరోగ్యం బలైపోతోంది. తక్షణమే యంత్రాంగం మేల్కొని, నగరంలో ఎక్కడా కల్తీ పాలు అమ్మకుండా కేవలం ఒరిజినల్ (స్వచ్ఛమైన) పాలు మాత్రమే విక్రయించేలా గట్టి నిబంధనలు అమలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**నగర నివాసుల తక్షణ డిమాండ్లు:**

ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు: నగర వ్యాప్తంగా ఉన్న డెయిరీ షాపులు, పాల విక్రయ కేంద్రాలపై వెంటనే ప్రత్యేక బృందాలతో ఆకస్మిక దాడులు నిర్వహించాలి.

**కఠినమైన చట్టపరమైన చర్యలు:** కల్తీకి పాల్పడుతున్న యజమానులపై సాధారణ జరిమానాలు విధించి వదిలేయకుండా, షాపులను తక్షణమే సీల్ చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.

**ప్రజా తనిఖీ కేంద్రాలు** :నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో ప్రజలు తాము కొనుగోలు చేసిన పాల నాణ్యతను ఉచితంగా పరీక్షించుకునేలా మొబైల్ టెస్టింగ్ వాహనాలను అందుబాటులో ఉంచాలి.

ప్రతి వారం షాపుల నుంచి పాల సాంపిళ్లను సేకరించి గుర్తింపు పొందిన ల్యాబ్‌లకు పంపి, ఆ నివేదికలను బహిరంగంగా వెల్లడించాలి. అధికారులు ఇకనైనా తమ నిమ్మకు నీరెత్తిన వైఖరిని వీడి, కల్తీ పాలు, పెరుగు, నెయ్యి విక్రయించే ముఠాలపై ఉక్కుపాదం మోపాలని నగర ప్రజలు కోరుతున్నారు. ప్రజారోగ్యంతో చెలగాటమాడే కల్తీ పాల వ్యాపారులకు కఠిన చర్యలు తీసుకుని, స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన పాల ఉత్పత్తులు దొరికేలా చూడాలని నగర ప్రజలు కోరుకుంటున్నారు.

# అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ప్రజలు తమ సమస్యలు తెలిపి సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.ఖానాపురం హవేలీ శివారు టేకులపల్లికి చెందిన వి.వెంకటయ్య ఈ నెల తనకు వృద్ధాప్య పెన్షన్ డబ్బులు జమ కాలేదని తన బ్యాంకు ఖాతాలో ఆ డబ్బులు జమ చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ డీఆర్డిఓ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఖమ్మం నగరం 44వ డివిజన్ లెనిన్ నగర్ కు చెందిన ఎస్.కే నాజియా తన కుమార్తె తలసేమియా వ్యాధితో బాధపడుతున్నా రని, తన కుమార్తెకు ఫించన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ డీఆర్డిఓ, సెర్ప్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం అర్బన్ మండలం కొత్తూరు గ్రామానికి చెందిన ఎం.సూర్య ప్రకాష్ పాపిరెడ్డి ఖమ్మం దేవరపల్లి హైవే ధంసలాపురం ఎంట్రీ ఎగ్జిట్ వద్ద ఉన్న తమ భూమికి దారి ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా,పీడి ఎన్. హెచ్ అధికారులకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.నేలకొండపల్లి మండలం నాచేపల్లి గ్రామానికి చెందిన వి. రామకృష్ణ తాను పి.జీ చదువుకున్నానని తనకు కంటికి సంబంధించిన దివ్యాంగత్వం ఉందని, తనకు ఏదైనా ఉపాధి చూపించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా ఉపాధి అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పరాస్ కుమార్, డిఆర్ఓ సిహెచ్ రామ్మూర్తి, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్,ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

## వేణుకుమార్ కుటుంబానికి నామ ట్రస్ట్ ద్వారా రూ.50 వేల ఆర్థిక సాయం

- దయచేసి నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడొద్దు - మాజీ ఎంపీ నామ విజ్ఞప్తి
- బాధిత కుటుంబాన్ని ఆదుకున్న మాజీ ఎంపీ నామను అభినందించిన యువత



**ముదిగొండ ఆగస్టు 03(ప్రజా జ్యోతి )**రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్స్ నోటిఫికేషన్లు విడుదల చేయడం లేదని ఆవేదనతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ముదిగొండ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన నిరుద్యోగ యువకుడు జీ. వేణుకుమార్ ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఆదివారం బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వర రావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎమ్మెల్సీ తాత మధుసూదన్, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు ఆస్పత్రికి వెళ్లి వేణుకుమార్‌ను పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన విషయం తెలిసిందే. పరామర్శ సందర్భంగా వేణుకుమార్ కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న నామ చలించిపోయి తన నామ ముత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ ద్వారా రూ.50 వేల రూపాయలు సోమవారం మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు, మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, ట్రస్ట్ ప్రతినిధి కనకమేడల సత్యనారాయణ చేతుల మీదుగా వేణుకుమార్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆదివారం వేణుకుమార్ నాయనమ్మకు ధైర్యం చెబుతూ "నేను అండగా ఉంటాను" అని భరోసా ఇచ్చిన నామ, చెప్పిన మాటను నిలబెట్టుకుంటూ పరామర్శించిన మరుసటి రోజే ఆర్థిక సాయం అందించడం విశేషం. క్లిష్ట సమయంలో నామ ముత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ బాధిత కుటుంబానికి అండగా నిలిచింది. నిరుద్యోగుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ఉంటుందని నామ పేర్కొన్నారు. సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదని, నిరుద్యోగ యువత ధైర్యంగా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. ఆపద సమయంలో అండగా నిలిచి వెంటనే ఆర్థిక సహాయం అందించిన నామకు వేణుకుమార్ కుటుంబ సభ్యులు, నిరుద్యోగ యువత కృతజ్ఞతలు తెలిపారు.

>>> **వేణుకుమార్ ఒక్కడి సమస్య కాదు.. లక్షలాది నిరుద్యోగుల ఆవేదన: కమల్‌రాజు**

ఈ సందర్భంగా కమల్‌రాజు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను నమ్మించి మోసం చేస్తోందని విమర్శించారు. 31 నెలల పాలనలో ఇచ్చిన హామీల్లో ఒక్కదానినీ పూర్తిగా అమలు చేయలేదని ఆరోపించారు. వేణుకుమార్ ఆత్మహత్యాయత్నం నిరుద్యోగుల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమని, నిరుద్యోగులు పడుతున్న వేదనకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వేణుకుమార్ కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు వారి నామా ముత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయాన్ని అందజేసినట్లు తెలిపారు. కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాకుండా, వేణుకుమార్ కోలుకున్న అనంతరం అతనికి అవసరమైన కోచింగ్‌తో పాటు ఇతర అవసరాల్లోనూ బీఆర్ఎస్ పార్టీ పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, తక్షణమే గ్రూప్స్‌తో పాటు పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ నోటిఫికేషన్లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇది కేవలం వేణుకుమార్ ఒక్కరి సమస్య కాదని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది నిరుద్యోగుల సమస్య అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోరంపూడి ప్రసాద్‌రావు, గడ్డం వెంకటేశ్వర్లు, వాకదాని కోటేశ్వరరావు, పెనుగొండ కొండలు, నామ వ్యక్తిగత కార్యదర్శి నాగరాజు, బీఆర్ఎస్ యువజన నాయకులు రేగళ్ల కృష్ణప్రసాద్, పగడాల రవికుమార్, షారుఖ్‌తో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని వేణుకుమార్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

## తల్లి బిడ్డల క్షేమమే ఐసిడిఎస్ లక్ష్యం

- ఐసిడిఎస్ సిడిపిఓ కమల ప్రియ

**చింతకాని ఆగస్టు. 3 ప్రజాజ్యోతి :**తల్లి బిడ్డల క్షేమమే ఐసిడిఎస్ లక్ష్యం అని, బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలని సిడిపిఓ చావా కమల ప్రియ అన్నారు. చింతకాని మండల పరిధిలోని నేరెడ 1 అంగన్వాడీ కేంద్రంలో చింతకాని సెక్టార్ సూపర్వైజర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలలో కమల ప్రియ మాట్లాడుతూ తల్లిపాలు తాగిన పిల్లల్లో రోగనిరోధక శక్తి అధికంగా ఉంటుందని చురుకుదనంగా ఉంటారని అన్నారు. తల్లిపాలతో సమానమైన పోషక విలువలు కలిగిన ఆహారం మరొకటి లేదు అన్నారు. గర్భిణీగా గుర్తించిన దగ్గర్నుంచి పోషక విలువలు కలిగిన ఆహారం తప్పనిసరిగా తీసుకోవాలని, పోషకాహార లోపం కలిగితే రక్తహీనత సమస్యతో పాటు పుట్టిన బిడ్డకు అవసరమైనన్ని పాలు అందించే అవకాశం ఉండదని, సుఖ ప్రసవం కష్టమవుతుందని అన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేసే విధంగా ర్యాలీలల,గృహ సందర్శనల,సమావేశాల ద్వారా 'అవగాహన కార్యక్రమాలు నిర్వహించి తల్లులకు ,కుటుంబ సభ్యులకు చైతన్య పరుస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ వైద్యులు ఎస్.కె సోయర్ మాట్లాడుతూ గర్భిణీలు బాలింతలు చిన్నారులకు అందించే వ్యాధి నిరోధక టీకాలు గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ముత్తయ్య, ఏఎన్ఎం లక్ష్మి, సెక్రెటరీ అర్జున్ ,జిపిఓ వెంకట్, అంగన్వాడి టీచర్ వెంకమ్మ, ఆయా,ఆశ కార్యకర్తలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.



## పదవి విరమణ పొందిన ఉద్యోగులను సన్మానించిన జిల్లా కలెక్టర్

- ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ నేపథ్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** దీర్ఘకాలంగా ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించి పదవీ విరమణ పొందిన ఉద్యోగులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఘనంగా సన్మానించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జూలై 31 నాటికి పదవి విరమణ పొందిన ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి.శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరై ఉద్యోగుల సేవలను కొనియాడారు.మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ లో అసిస్టెంట్ సిడిపిఓ గా పని చేస్తున్న జే.రత్నకుమారి,జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయ డ్రైవర్ సి.హెచ్.నాగరాజు పదవి విరమణ వేడుకలు బాగా జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ సుమారు 30 నుంచి 35 సంవత్సరాల పాటు ప్రజా సేవలో నిర్విరామంగా సేవలు అందించి నేడు పదవి విరమణ పొందుతున్న అధికారులకు ,సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పదవీ విరమణ తర్వాత వారు జీవితం ప్రశాంతంగా, ఆరోగ్యవంతంగా జీవించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.అనంతరం జిల్లా కలెక్టర్,అదనపు కలెక్టర్లు పదవి విరమణ పొందిన ఉద్యోగస్తులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పరాస్ కుమార్, డిఆర్ఓ సిహెచ్ రామ్మూర్తి, డిడబ్ల్యుఓ ఏ.ప్రమీల,జిల్లా ఉపాధి అధికారి ఎన్.మాధవి, జిల్లా అధికారులు,సంబంధిత శాఖల అధికారులు,పదవి విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి భవనము కొరకు స్థల వితరణ



**కారేపల్లి, ఆగస్టు 3, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల పరిధిలోని పేరేపల్లి గ్రా మంలో నూతన అంగనవాడి భవన నిర్మాణం కొరకు స్థలమును పేరేపల్లి గ్రామ నివాసి స్వర్గీయ పర్స సూర్య ప్రకాశరావు ఛాయాదేవిల జ్ఞాపకార్థం వారి శ్వాధీనంలో ఉన్నటువంటి గతంలో గ్రామపంచాయతీకి ఇచ్చిన స్థలములో ఉన్నటువంటి ఖాళీ స్థలమును సర్పంచ్ బానోతు పద్మావతిచేతుల మీదుగా సోమవారం అంగన్వాడి సూపర్వైజర్ సత్యశీల, అంగన్వాడి సెంటర్ 2 ఉపాధ్యాయురాలు సుశీల కి అంగన్వాడి భవన నిర్మాణం కోసం కేటాయించడం జరిగినది . ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ సురేష్, భానోత్ వీరభద్రం, అంగన్వాడి టీచర్లు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఐదు నెలలుగా వేతనాలు లేని ఆపరేటర్లు

- కుటుంబాల పరిస్థితి అధ్వానం



**కారేపల్లి, ఆగస్టు 3, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లకు గత ఐదు నెలలుగా వేతనాలు రావడం లేదని, దీంతో కుటుంబం గడపడమే చాలా కష్టంగా ఉందని ఆపరేటర్లు సోమవారం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివిధ శాఖలలో పని చేసే అధికారులకు నెలసరి వేతనాలు ఇచ్చే విధంగానే , కంప్యూటర్ ఆపరేటర్లు కూడా నెలవారి వేతనాలను ఇచ్చి తమ కుటుంబాలను ఆదుకోవాలని, ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కుటుంబాన్ని గడపడానికి అనేక ప్రాంతాలలో అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొని ఉందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్ద మనసు చేసుకొని కంప్యూటర్ ఆపరేటర్ల ఆవేదనను అర్థం చేసుకొని నెలసరిగా వేతనాలను మంజూరు చేయాలని వారు కోరుతున్నారు.

## 5 నుంచి సమగ్ర భూ సర్వే గ్రామ సభలు




**నేలకొండపల్లి, ఆగస్టు 3 ప్రజా జ్యోతి:** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ సర్వే పై అవగాహన కల్పించేందుకు 5 నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు నేలకొండపల్లి తహశీల్దార్ పి.రాంప్రసాద్ తెలిపారు. సోమవారం తన చాంబర్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు... తెలంగాణ సర్వే మరియు సరిహద్దుల చట్టం ప్రకారం భూ సర్వే చేసేందుకు మండలం లోని పలు గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. భూ సర్వే చేసే విధానం పై అవగాహన కల్పించేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 5 న కొంగర (రైతు వేదిక) తిరుమలాపురం ( గ్రామ పంచాయతీ కార్యాలయం), రామచంద్రాపురం (గాంధీ సెంటర్) లలో సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 6 న చందాపురం(అనాసాగారం, గ్రామపంచాయతీ). ఆచార్లగూడెం 1 ( గ్రామపంచాయతీ కార్యాలయం). కోనాయిగూడెం (గ్రామ పంచాయతీ కార్యాలయం) లలో సభలు జరగనున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలు, రైతులు పాల్గొని భూ సర్వే పై అవగాహన కల్పించుకోవాలని సూచించారు. ఈ విలేకర్ల సమావేశంలో మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఆలస్యం మధుసూధనావు ఉన్నారు.

## మండలంలో మువ్వా పర్యటన



**వేంసూరు,ఆగస్టు03ప్రజాజ్యోతి** వేంసూరు మండలంలో గల భీమవరం గ్రామంలో సోమవారం రాష్ట్ర ఇరిగేషన్ శాఖ చైర్మన్ మువ్వా విజయ్ బాబు ఆత్మీయ పలకరింపు పర్యటన చేశారు.దానిలో భాగంగా గ్రామానికి చెందిన తిరుమలశెట్టి రామకృష్ణ,కుమారి దంపతులకు చెందిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిర్మించిన గృహాన్ని సందర్శించి వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఇటీవల మరణించిన తోట వెంకటేశ్వరరావు దశదిన వేడుకలో పాల్గొని చిత్రపటానికి పుష్పాలు వేసి ఘనంగా నివాళులర్పించారు.కుటుబ సభ్యులను ఓదార్చారు.అంతకన్నా ముందు గ్రామ యూత్ కాంగ్రెస్ నేత మువ్వా వర్గీయుడు కవిశెట్టి వేణు కాలుకు దెబ్బ తగిలి ఇంటికే పరిమితం అవ్వగా తెలుసుకొని వేణు ను పరామర్శించారు మనో ధైర్యాన్ని కల్పించారు.ఈ కార్యక్రమంలో: గ్రామ సర్పంచ్ వంట్ల రమేష్,ధర్మారావు, కాల్నేని రాజేష్,మువ్వా అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి



**నేలకొండపల్లి, ఆగస్టు 3 ప్రజా జ్యోతి:** సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ వైద్యాధికారి మాధవి సూచించారు. మండలం లోని కొత్తకొత్తూరు పంచాయతీ లో సోమవారం ఉచిత వైద్య శిభిరం ను నిర్వహించారు. పలువురు కు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు...ప్రతీ ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. బయట ఆహార పదార్థాలను తినకుండా సాధ్యమైనంత వరకు ఇంటి ఫుడ్ కు ప్రాధ్యానత ఇవ్వాలని సూచించారు. మన చేతుల్లోనే మన ఆరోగ్యం ఉందన్న విషయం ను తెలుసుకోవాలని సూచించారు. దోమ పుట్టకుండా...కుట్టకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాళోత్ కళావతి, ఉప సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ, పంచాయతీ కార్యదర్శి గుండు రవి. ఏఎన్యం రమణ, సూపర్వైజర్ విజయకుమారి, ఆశా కార్యకర్తఅరుణ తదితరులు పాల్గొన్నారు.

# పీ.కే ఓసి డీప్ సైడ్ బొగ్గు బ్లాక్ సింగరేణికి కేటాయింపు

- సింగరేణి సంస్థ, మణుగూరు కు నూతన ఆశాకిరణం
- ఐఎన్టీయూసీ నేత తీగల క్రాంతి కుమార్



**సత్తుపల్లి ఆగస్టు03(ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్ర మినిమం అడ్వైజరీ బోర్డ్ చైర్మన్, ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు ఆగస్ట్ 01 వ తేదీన వేలాది మంది కార్మికులతో సింగరేణి వ్యాప్తంగా ఐఎన్టీయూసీ యూనియన్ ఆధ్వర్యంలో మణుగూరు డిప్ సైడ్ బొగ్గు బ్లాక్ సింగరేణి సంస్థకు కేటాయించాలనీ చేసిన ఉద్యమ ఫలితంగానే సింగరేణి సంస్థకు పీ.కే ఓసి 2 డీప్ సైడ్ బొగ్గు బ్లాక్ కేటాయించారని ఇది సింగరేణి కార్మికుల ఐక్యతకు , పోరాట స్ఫూర్తికి దక్కిన ఘన విజయం అని ఐఎన్టీయూసీ జాయింట్ జనరల్ సెక్రెటరీ తీగల క్రాంతి కుమార్ తెలిపారు. తీగల క్రాంతికుమార్ మాట్లాడుతూ గతంలో తాడిచెర్ల 2 బ్లాకును కూడా సింగరేణికే కేటాయించాలని డాక్టర్ బి.జనక్ ప్రసాద్ నేతృత్వంలో కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డి ని కలిసి విన్నవించిన ఫలితంగా గత నెలలో తాడిచెర్ల-2 బ్లాక్ ను సింగరేణికే కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సందర్భంగా కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డి ని కలిసిన డాక్టర్ బి.జనక్ ప్రసాద్ పి.కే ఓసి డీప్ సైడ్ బ్లాక్ కూడా సింగరేణికే కేటాయించాలని , సింగరేణికి కేటాయించకపోవడం వలన జరిగే అన్యాయాలను ,సింగరేణికి సంస్థకు కలిగే నష్టాలను వివరించిన ఫలితంగా పి.కే ఓసి డీప్ సైడ్ బ్లాక్ సింగరేణికే కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయం అని వేలాది మంది కార్మికుల ఉద్యోగ భద్రత బలపడటమే కాకుండా , స్థానిక నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ , ఉపాధి అవకాశాలు కలుగుతాయని తెలిపారు.మణుగూరు ప్రాంతం మరోసారి పారిశ్రామిక అభివృద్ధికి కేంద్ర బిందువుగా నిలుస్తుంది అని తెలుపుతూ ఐఎన్టియుసి సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో ఉండే అన్ని బొగ్గు బ్లాక్ లను సింగరేణి సంస్థకు కేటాయించేంత వరకు ఐఎన్టీయూసీ యూనియన్ పోరాటం చేస్తుందని సింగరేణి సంస్థబలోపేతం, కార్మికుల హక్కుల సంరక్షణ ,కార్మికుల హక్కుల సాధనలో ఎల్లప్పుడూ కార్మికుల పక్షానే ఐఎన్టియుసి యూనియన్ నిరంతరం పోరాటం చేస్తుందని తెలియజేశారు.

## ఘనంగా తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం సూపర్వైజర్ రమణ



**కారేపల్లి, ఆగస్టు 3, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల పరిధిలోని తొడితల గూడెం గ్రామపంచాయతీ పంతుల్ నాయక్ తండ అంగన్వాడి కేంద్రంలో "తల్లిపాల వారోత్సవాల" కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎం. రమణ, సర్పంచ్ బానోతు ప్రియాంక మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు మొదటగా వచ్చే ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకాతో సమానమని పుట్టినప్పటి నుండి బిడ్డకు ఆరు నెలలు పూర్తయ్యే వరకు కేవలం తల్లిపాలే త్రాగించాలి తల్లిపాలలో బిడ్డ ఎదుగుదలకు అవసరమయ్యే అనేక రకాలైన పోషకాలు బిడ్డకు అందుతాయని, అనారోగ్య సమస్యలు రాకుండా కాపాడతాయని నేటి ఆరోగ్యకరమైన బిడ్డలే రేపటి పౌరులుగా ఎదుగుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎం ఎల్ హెచ్ వి సి హెచ్ విద్యా, ఏఎన్ఎం కే.కోటమ్మ, అంగన్వాడి టీచర్లు జి. అరుణ, జి విజయ కుమారి, జి. రాజకుమారి, ఆశా కార్యకర్త బి.పద్మ, గర్భిణీలు, బాలింతలు వారి కుటుంబ సభ్యులు, ప్రీ స్కూల్ పిల్లలు వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన బి ఆర్ఎస్ నాయకులు

**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఇటీవల అకాల మరణం చెందారు వారి కుటుంబాన్ని ఎర్రుపాలెం మండలం బి ఆర్ ఎస్ నాయకులు సోమవారం పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారుఈ కార్యక్రమలో మండల కార్యదర్శి యన్నం శ్రీనివాసరెడ్డి,సర్పంచ్ ఇనపనూరి లాలయ్య, సీనియర్ మండల నాయకులు కుడుముల మల్లికార్జునరెడ్డి కోటా లోకేష్ శీలం నారాయణరెడ్డి,బొర్రా నరసింహారావు, యరమల కృష్ణారెడ్డి ,గద్దల శ్రీనివాసరావు,తిరుపతిరావు,కాళేశ్వరరావు, కత్తి నాగేశ్వరరావు,కాలసాని వెంకటనారాయణ,కూరపాటి నాగేశ్వరరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## దసరా జాతర సందర్భంగా షాపుల వేలం పాటలు

- ట్రస్ట్ చైర్మన్ పట్టాభి, ఈవో కె. వెంకటయ్య



**కారేపల్లి, ఆగస్టు03, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల పరిధిలోని ఉసిరికాయల పల్లి గ్రామంలో వేంచేసి ఉన్నకోట మైసమ్మ వారి దేవస్థానం పరిధిలో నిర్వహించు 2026 దసరా జాతర సందర్భంగా పుట్నాలు, మిఠాయిలు అమ్ముకొను వివిధ లైసెన్స్ హక్కుల బహిరంగ వేలం పాటలు రెండు షాపుల కొరకు ది: 05.08.2026 బుధవారం రోజు ఉదయం 11 గంటలకు ఉసిరికాయలపల్లి గ్రామంలోని దేవాలయ ప్రాంగణం నందు దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో బహిరంగ వేళము జరుపబడుననీ ట్రస్ట్ చైర్మన్ పరస పట్టాభి రా మారావు, ఈవో కె వెంకటయ్యలు సోమవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఆసక్తి గలవారు ఆలయ, దేవాదాయ శాఖ నియమ నిబంధన ప్రకారం పాటలో పాల్గొనగలరని పేర్కొన్నారు.

## యువత సామాజిక సేవలో ముందుండాలి

- రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు



**నేలకొండపల్లి, ఆగస్టు 3 ప్రజా జ్యోతి :** యువత సామాజిక సేవలో ముందుండాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు సూచించారు. జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు పుట్టిన రోజు సందర్భంగా సోమవారం యువత ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కేక్ కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు...ప్రభుత్వం చేపడుతున్న పలు సంక్షేమ కార్యక్రమాల పై యువత విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ప్రతీ ఒక్కరూ పుట్టిన రోజు సందర్భంగా మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బచ్చలకూరి నాగరాజు తో పాటు రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి జెర్రిపోతుల అంజని, రాయగూడెం సర్పంచ్ బోయిన వేణు, "యువత షేక్ సైదా, షేక్ మహుబూబుపాషా, లాల్పాషా తదితరులుపాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లాలో జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల జారీని వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్ లో టిడబ్ల్యూజేఎఫ్ (హెచ్- 2843) వినతి
- జిల్లా అధ్యక్ష, కార్యద ర్శులు నానబాల రామ కృష్ణ,అర్వపల్లి నగేష్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లో జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల జారీ ప్రక్రియ పూర్తయి, అర్హులైన పాత్రికేయులకు ప్రభుత్వం అక్రిడేషన్ కార్డులను అందజేసినప్పటికీ, ఖమ్మం జిల్లాలో మాత్రం ఇప్పటికీ గణనీయ సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్ లో ఉండడం పట్ల తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (TWJF–H 2843) ఖమ్మం జిల్లా యూనియన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్ కి యూనియన్ ప్రతినిధులు గ్రీవెన్స్ లో వినతిపత్రం సమర్పించి, పెండింగ్‌లో ఉన్న అక్రిడేషన్ దరఖాస్తులను అత్యవసరంగా పరిష్కరించాలని కోరారు.ఈ సందర్భంగా అధ్యక్ష,కార్యదర్శులు నానబాల రామకృష్ణ, అర్వపల్లి నగేష్ మాట్లాడుతూ, జర్నలిస్టులు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తూ, నాలుగో స్తంభంగా ఉంటూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన బాధ్యతను నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, అధికార యంత్రాంగం చేపడుతున్న చర్యలను నిష్పాక్షికంగా ప్రజలకు చేరవేయడంలో పాత్రికేయులు విశేష సేవలు అందిస్తున్నారని తెలిపారు. అదేవిధంగా ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు, ఎన్నికలు, విపత్తులు, అంటువ్యాధులు, ప్రజా ఉద్యమాలు, ప్రభుత్వ కార్యక్రమాలు వంటి ప్రతి సందర్భంలో తమ వ్యక్తిగత భద్రతను సైతం పక్కనపెట్టి ప్రజల కోసం నిరంతరం విధులు నిర్వహించే వృత్తి జర్నలిజమని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పనిచేసే జర్నలిస్టులకు ప్రభుత్వం గుర్తింపుగా అందించే అక్రిడేషన్ కార్డు కేవలం ఒక గుర్తింపు పత్రం మాత్రమే కాకుండా, వారి వృత్తిపరమైన సేవలకు ప్రభుత్వం ఇచ్చే గౌరవ సూచికమని అభిప్రాయపడ్డారు.రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో అక్రిడేషన్ కార్డుల జారీ పూర్తయినప్పటికీ ఖమ్మం జిల్లాలో ప్రక్రియ ఆలస్యం కావడం వల్ల అనేక మంది అర్హులైన జర్నలిస్టులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వ సమావేశాలు,అధికారిక కార్యక్రమాలు, వివిధ శాఖల సమాచార సేకరణ, ఇతర అధికారిక అవసరాల్లో అక్రిడేషన్ కార్డు కీలకంగా ఉపయోగపడుతుందని, ఆలస్యంతో వృత్తిపరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు.జర్నలిస్టులకు ప్రభుత్వం ప్రకటించే సంక్షేమ పథకాల అమలు, అధికారిక గుర్తింపు, వివిధ సందర్భాల్లో లభించే సౌకర్యాలు కూడా అక్రిడేషన్ కార్డుపైనే ఆధారపడి ఉంటాయని, అందువల్ల పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి అర్హులైన వారందరికీ కార్డులు జారీ చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (TWJF–H 2843) ఖమ్మం జిల్లా యూనియన్ తరఫున జిల్లా కలెక్టర్ ను కోరుతూ, ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి, పెండింగ్‌లో ఉన్న అక్రిడేషన్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర టి.ఎస్ ఈ అంశాన్ని సానుకూలంగా పరిగణించి, పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల అక్రిడేషన్ దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించి, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ప్రభుత్వం అందించే అక్రిడేషన్ కార్డులను త్వరితగతిన జారీ చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (TWJF–H 2843) ఖమ్మం జిల్లా యూనియన్ విజ్ఞప్తి చేసింది. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి గౌరవం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ దృష్ట్యా ఈ సమస్యను అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి తక్షణ చర్యలు తీసుకోవాలని యూనియన్ నాయకులు మరియు సభ్యులు కోరారు. ఈ సందర్భంగా స్పందించిన కలెక్టర్ దివాకర్ టి.ఎస్ మీరు ఇచ్చిన వినతి పత్రాన్ని పరిగణలోకి తీసుకొని మీ అక్రిడేషన్ కార్డుల జారీ ని త్వరితగతిన పూర్తి అయ్యేలా చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ హెచ్–2843 జిల్లా కోశాధికారి వేములకొండ రమేష్, స్టేట్ కౌన్సిల్ మెంబర్స్ సామ్రాట్ గుప్తా, నల్లా రాకేష్ రెడ్డి, ఉపాధ్యక్షులు కందరబోయిన నాగకృష్ణ, కిరణ్, టీబీజేఏ జిల్లా కార్యదర్శి కాసోజు శ్రీధర్, వీడియో గ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షులు అమరబోయిన ఉపేందర్,సంయుక్త కార్యదర్శి కరుణాకర్ సుదగాని, నగర అధ్యక్షులు ఎలుగోటి వెంకట్, కార్యదర్శి కప్పల మధు గౌడ్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అంతోటి శ్రీనివాస్, గుజ్జు గోపాల కృష్ణ, ఎలిసేట్టి రామకృష్ణ బాబు, బంక మధు తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరు పి కే ఓ సి డీప్ సైడ్ బ్లాక్ సింగరేణికి దక్కడం చారిత్రాత్మక విజయం

- ఐ.ఎన్. టి.యు.సి వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు





**సత్తుపల్లి ఆగస్టు03(ప్రజా జ్యోతి )**మణుగూరు పీకే ఓ సి..2 డీప్ సైడ్ బొగ్గు బ్లాక్ 6.5% రెవెన్యూ షేర్‌తో సింగరేణి సంస్థకు దక్కడం కార్మిక ఉద్యమాల చారిత్రాత్మక విజయమని ఐ ఎన్ టి యు సి సెక్రటరీ జనరల్, మినిమం వేజెస్ బోర్డు చైర్మన్ గౌరవ ప్రసాద్ పేర్కొన్నారని వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు తెలిపారు.ఆయన మాట్లాడుతూ,ఈ విజయానికి ఐ ఎన్ టి యు సి ఆధ్వర్యంలో నిర్వహించిన నిరాహార దీక్షలు, ధర్నాలు, రాస్తారోకోలు, గేట్ మీ టింగులు, కార్మిక చైతన్య కార్యక్రమాలు బలమైన పునాదిగా నిలిచాయని అన్నారు. జెన్‌కోకు వేలంపాట ద్వారా వెళ్లకుండా సింగరేణికే ఈ బ్లాక్‌ను కేటాయించాలని చేసిన డిమాండ్‌కు ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం వల్లే ఈ విజయం సాధ్యమైందని పేర్కొన్నారు.ఈ బొగ్గు బ్లాక్ సింగరేణికి దక్కడం ద్వారా వేలాది మంది కార్మికుల ఉపాధి భద్రత, సంస్థ భవిష్యత్తు మరియు తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు మరింత పరిరక్షించబడతాయని తెలిపారు.సింగరేణి పరిరక్షణ, కార్మిక హక్కుల సాధన కోసం భవిష్యత్తులో కూడా యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యమాలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.చివరగా, ఈ విజయానికి సహకరించిన కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి కృతజ్ఞతలు తెలిపారు.

# దేవాలయం భూముల ను కాపాడండి..!

- జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేత



**నేలకొండపల్లి, ఆగస్టు 3 ప్రజా జ్యోతి :** దేవాలయం భూములను కాపాడాలని అమ్మగూడెం కు చెందిన అడపాల రమేష్ జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ను అందించారు. వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలంలోని రాజేశ్వర పురం గ్రామానికి చెందిన శ్రీరాజగోపాల స్వామి దేవాలయం కు సర్వే నెంబర్ 258 లో 17.12 ఎకరాలు, సర్వే నెంబర్ లో 263 లో 3,29 ఎకరాలు, సర్వే నెంబర్ 264 లో 15.12 ఎకరాలు మొత్తం 36.13 ఎకరాలు భూమి ఉంది. దేవాలయం భూములను కొంత మంది భూ ఆక్రమణ చేయటంతో పాటు మరి కొంత మంది ఏకంగా ఆక్రమణ తో పాటు విక్రయాలు కూడ 'చేశారని ఫిర్యాదులో పేర్కోన్నారు. దేవాలయం భూములలో బోర్లు కూడా వేశారని ఆరోపించారు. భూమి లో నుంచి పైపులైన్లు దర్జాగా వేసుకున్నారన్నారు. దేవాలయం కు చెందిన భూమి ని ఆక్రమణ చేసి విక్రయాలు చేపడుతున్న వారి పై సమగ్ర విచారణ చేసి దేవాలయం భూమి ని స్వాధీనం చేసుకుని దేవాలయం భూములను కాపాడాలని కోరారు. ఆక్రమణ దారుల పై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

# అమెరికాలోని చుండు మధు నివాసంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



**చింతకాని ఆగస్టు 03 ప్రజాజ్యోతి :**అమెరికాలో నివాసం ఉంటున్న పందిళ్ళపల్లి గ్రామానికి చెందిన చుండు మధు– శైలజ దంపతుల నివాసానికి డిప్యూటీ సీఎం రాష్ట్ర ఆర్థిక విద్యుత్ ప్రణాళిక శాఖ మాత్యులు మల్లు భట్టి విక్రమార్క వెళ్లారు. గతంలో సైతం పలుమార్లు మధు నివాసంలో గడిపిన భట్టి విక్రమార్క. అమెరికాలో ఉంటున్న తెలుగు వారి యోగక్షేమాల గురించి మధు గారిని అడిగి తెలుసుకున్న భట్టి విక్రమార్క అమెరికాలో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు అమెరికాలో పందిళ్ళపల్లి గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు మధు పట్ల తన అభిమానాన్ని చూపుతున్న భట్టి విక్రమార్క కు పందిళ్ళపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ తరపున కృతజ్ఞతలు.

# తల్లిపాలే శిశువుకు తొలి రక్షణ కవచం

- హస్నాబాద్ అంగనవాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల అవగాహన సమావేశం



**తిరుమలాయపాలెం,ఆగస్టు 3 ప్రజా జ్యోతి** మండలంలోని హస్నాబాద్ అంగనవాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన సమావేశాన్ని అంగనవాడి సూపర్వైజర్ లక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కొవ్వూరి పద్మ సత్తిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సర్పంచ్ కొవ్వూరి పద్మ సత్తిరెడ్డి మాట్లాడుతూ..పుట్టిన శిశువుకు తల్లిపాలే సంపూర్ణ ఆహారమని, తొలి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వడం ద్వారా శిశువుకు అవసరమైన పోషకాలు, వ్యాధి నిరోధక శక్తి లభిస్తాయని తెలిపారు. తల్లిపాలు బిడ్డ ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు ఎంతో దోహదపడతాయని, తల్లి ఆరోగ్యాన్ని కూడా కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు.అంగనవాడి సూపర్వైజర్ లక్ష్మీ మాట్లాడుతూ, ప్రతి తల్లి తల్లిపాల ప్రాముఖ్యతను తెలుసుకుని శిశువుకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని సూచించారు. తల్లిపాల వల్ల శిశువుకు అంటువ్యాధులు వచ్చే ప్రమాదం తగ్గడంతో పాటు మానసిక, శారీరక ఎదుగుదల మెరుగుపడుతుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో అంగనవాడి కార్యకర్తలు ఉపేంద్ర, సునీత ఆశా కార్యకర్తలు భవాని, రాధిక,ఆయలు నాగ లక్ష్మీ, శైలజ, గర్భిణులు, బాలింతలు, గ్రామ మహిళలు పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన పొందారు.

# కారేపల్లి సొసైటీకి పహారి నిర్మాణ పనులు ప్రారంభం

- ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన పాలకవర్గం

**కారేపల్లి, ఆగస్టు3, ప్రజా జ్యోతి:** కారేపల్లి సొసైటీ కార్యాలయం చుట్టు ప్రహారీ గోడ నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. పహారి పనులను సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, సింగరేణి సర్పంచ్ మేదరి వీరప్రతాఫ్(టోనీ)లు ప్రారంభించారు. ప్రహారి గోడ నిర్మాణానికి మొదటి విడుతగా వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ నియోజవర్గ స్పెషల్ అభివృద్ధి నిధులు రూ. 5లక్షలు మంజూరు చేయటం జరిగింది. ఆ నిధులతో ప్రహారి నిర్మాణ పనులకు గ్రామపంచాయతీ తీర్మాణంతోపనులను చేపట్టారు. ఈసందర్భంగా చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ సొసైటీ ద్వారా రైతులకు అన్ని రకాలు సేవలను అందిస్తున్నామని, ప్రభుత్వ పధకాలను అమలు చేయటం జరుగుతుందన్నారు. మరిన్ని సేవలు అందించటానికి సొసైటీకి అనుబంధంగా రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్.పీ.వో) ను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు.దానిలోరూ.2వేలు కట్టి సభ్యులుగా చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తోటకూరి రాంబాబు, సొసైటీ కార్యదర్శి బొల్లు హనుమంతరావు, ఉపసర్పంచ్ పెద్దమ్మ భాగ్యలక్ష్మి , డైరక్టర్లు అడ్డగోడ ఐలయ్య, దేగల ఉపేందర్, వార్డు సభ్యురాలు అంకోలు విజయ, గ్రామ పెద్దలు పెద్దమ్మ సత్యం,కేలోత్ రవి, పెంద్ర నాగేష్, శంకర్ , రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



# తిరుమలపురం గ్రామ సభలో అభివృద్ధి, ప్రజారోగ్యంపై కీలక నిర్ణయాలు



**చింతకాని ఆగస్టు 03ప్రజాజ్యోతి :** మండల పరిధిలోని తిరుమలపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రామసభలో గ్రామాభివృద్ధి, ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు.గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు అధ్యక్షతన జరిగిన ఈ గ్రామసభలో గ్రామ కార్యదర్శి కొండపల్లి ఉమారాణి, ఉపసర్పంచ్ గోగుల నాగమణి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.గ్రామంలో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీటి సరఫరా, పనిచేయని వీధి దీపాల మరమ్మతులు,డ్రైనేజీ కాలువల శుభ్రత,దోమల నివారణకు ప్రత్యేక స్ప్రే, డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి గ్రామ ప్రజలకు ఆరోగ్య పరీక్షలు,వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.అలాగే ప్రతి ఇంటి వద్ద మొక్కలు నాటి వాటి సంరక్షణకు గ్రామస్థులు బాధ్యత వహించాలని, పరిశుభ్రమైన గ్రామ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, పారిశుద్ధ్య నిర్వహణ, మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజా సమస్యల సత్వర పరిష్కారంపై గ్రామసభలో చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు.ఈ సందర్భంగా సర్పంచ్ చాపలమడుగు వీరబాబు మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని, గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.గ్రామ కార్యదర్శి కొండపల్లి ఉమారాణి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం గ్రామాభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేస్తామని తెలిపారు. ఉపసర్పంచ్ గోగుల నాగమణి, వార్డు స భ్యులు,గ్రామ పెద్దలు, మహిళా సం ఘాల సభ్యులు, యువకులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రా మ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వనమహోత్సవంలో ఇంటింటికి మొక్కల పంపిణీ చేసిన సర్పంచ్

- చాపలమడుగు వీరబాబు



**చింతకాని ఆగస్టు 03 ప్రజాజ్యోతి :** మండల పరిధిలోని తిరుమలాపురం గ్రామంలో వనమహోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు గ్రామ ప్రజలకు మొక్కలను పంపిణీ చేసి, ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఎంతో అవసరమని, మొక్కలను నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఇంటా పచ్చదనం పెంపొందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కొండపల్లి ఉమారాణి, ఉప సర్పంచ్ గోగుల నాగమణి, మేటు మడి పల్లి రామకృష్ణ, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కుటుంబంలో ఓట్లన్ని ఒకే పోలింగ్ బూతులోనే జిల్లా అంతటా అమలు చేయాలని విజ్ఞప్తి



**వేంసూరు,ఆగస్టు03 ప్రజాజ్యోతి** ఒకే కుటుంబం, ఒకే కాలనీకి చెందిన ఓటర్ల పేర్లు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో నమోదవుతున్న సమస్యను పరిష్కరించే దిశగా ఎన్నికల సంఘం చర్యలు చేపట్టడంపై నియోజకవర్గంలోని వేంసూరు మండలం మర్లపాడు గ్రామానికి చెందిన బీజేపీ ఖమ్మంజిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్ణి వీరంరాజు సోమవారం మీడియా సమావేశంలో హర్షం వ్యక్తం చేశారు.తన విజ్ఞప్తిపై స్పందించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా అధికారులకు అవసరమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ విధానాన్ని సత్తుపల్లి నియోజకవర్గంతో పాటు ఖమ్మంజిల్లా వ్యాప్తంగా పూర్తిస్థాయిలో అమలు చేసి ఓటర్ల ఇబ్బందులు తొలగించాలని జిల్లా కలెక్టర్‌ను వీరంరాజు కోరారు.

## పాగింగ్ చేపిస్తున్న ముచ్చర్ల సర్పంచ్

- విద్యుత్ లైన్ లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తీయించడం



**కామేపల్లి ప్రజా జ్యోతి ఆగస్టు 3** కామేపల్లి మండలం ముచ్చర్ల గ్రామపంచాయతీ పరిధిలో దోమల బెడద ఎక్కువైనందున పాగింగ్ చేపిస్తున్న ముచ్చర్ల సర్పంచ్ జాటోత్ లూసి మరియు విద్యుత్తు లైనులకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తీయించడం జరిగింది తర్వాత ట్యాంకు వెళ్లే పైపులైన్లు రిపేర్ చేయించడం జరిగింది .తల్లిపాల వారోత్సవాలు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తో పాటు ముచ్చర్ల గ్రామ సెక్రెటరీ పి అనురాధ మరియు హెల్త్ సిబ్బంది అంగన్వాడి సిబ్బంది ఎలక్ట్రిషన్ సిబ్బంది గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## తల్లిపాలే శిశువుకు తొలి రక్షణ



**కల్లూరు ఆగస్టు 03 ప్రజా జ్యోతి :** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా కల్లూరు మండల పరిధిలోని చంద్రుపట్ల రఘునాధ గూడెం గ్రామపంచాయతీల పరిధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో సోమవారం తల్లిపాల వారోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్టార్ సూపర్వైజర్ సుజాత మాట్లాడుతూ శిశువు పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించడం అధిక పోషణ విలువలు ఉండటంతో పాటు తల్లి బిడ్డల మధ్య అనుబంధాన్ని పెంపొందిస్తాయని, శిశువును అనేక వ్యాధుల భారీ నుంచి రక్షిస్తాయని వివరించారు. తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణీలు బాలింతలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గర్భిణీలు బాలింతలు చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రఘునాధగూడెం సర్పంచ్ కుక్క సుధారాణి, ఉప సర్పంచ్ కర్నాటి కోటేశ్వరి, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు జ్యోతి, పద్మ, రేవతి, యశోద, లక్ష్మి, మంగమణి, ప్రియాంక కృష్ణవేణి, గర్భిణీలు, బాలింతలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

## తల్లిపాలు పిల్లలకు శ్రేష్టకరం

- సర్పంచ్ వేమిరెడ్డి పరమేశ్వరి




**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** మండల పరిధిలోని రామన్నపాలెం గ్రామంలో అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ వేమిరెడ్డి పరమేశ్వరి పాల్గొన్నారుఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంటి బిడ్డలకు తల్లిపాలు శ్రేష్టకరమని చిన్న పిల్లలకు డబ్బాపాలు లేదా పాకెట్ పాలు పట్టించరాదని తల్లిపాలలోనే పిల్లలకు కావలసిన పోషకాలు లభిస్తాయని తల్లి మురుబాలు పిల్లలకి ఆరోగ్యకరం మరియు శ్రేష్టకరమని ప్రతి ఒక్కరు ఈ విషయాన్ని గమనించి చంటి పిల్లలకు తల్లిపాలను పట్టించాలని ఆమె కోరారు ఈ కార్యక్రమంలో హెల్త్ డిపార్ట్మెంట్ కొత్తపల్లి సుధాకర్ రూప సెక్రెటరీ గోపీచంద్ అంగన్వాడీ టీచర్స్ బొబ్బిళ్ళపాటి ఝాన్సీ రాణి జిల్లెల్ల పద్మావతి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిలు కీర్తి ఆశ వర్కర్లు వేల్పుల రత్నకుమారి కొత్తపల్లి వరలక్షి అంగన్వాడి ఆయా బొబ్బిళ్ళ పాటి శిరీష గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య



**ఎర్రుపాలెంప్రజా జ్యోతి** ఎర్రుపాలెం–తొండలగోపవరం రైల్వే స్టేషన్ల మధ్య సోమవారం విషాద ఘటన చోటుచేసుకుంది. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో కిలో మీటర్ నెం. 542/32–34 వద్ద, పెగళ్ళపాడు ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా, వీరులపాడు మండలం, అల్లూరు గ్రామానికి చెందిన రామిశెట్టి వేణు (21) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం, వ్యక్తిగత కారణాలతో సాయినగర్ షిర్డీ నుంచి కాకినాడకు వెళ్తున్న ట్రైన్ నెం. 17205 సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్ కింద పడి అతడు ప్రాణాలు తీసుకున్నట్లు తెలిపారు. మృతుడు ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నట్లు సమాచారం. ఘటనపై ఖమ్మం రైల్వే ఎస్సై సీహెచ్. వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు మధిర రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎస్. వేణుగోపాల్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని అన్నం శ్రీనివాసరావు సహకారంతో మధిర ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

## ప్రధానిని విమర్శిస్తే నీకు బాధ కలిగిందా పవన్ కళ్యాణ్ ?

- సిపిఐ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవి



**మధిర ప్రజా జ్యోతి** జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ని ఉద్దేశించి సిపిఐ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు సీనియర్ నాయకులు బెజవాడ రవి సోమవారం మాట్లాడుతూ నీట్ విద్యార్థులు 21 మంది చనిపోతే బాధ పడలేదు.జంతర్ మంతర్ వద్ద విద్యార్థులను అమానుషంగా లాఠీ ఛార్జ్ చేస్తే బాధపడలేదు – చనిపోయిన విద్యార్థుల కుటుంబాలు తమ పిల్లలను తలుచుకుని ఏడుస్తుంటే.. నీకు బాధ లేదు.కానీప్రధానిని విమర్శిస్తే మాత్రం బాధ కలిగిందా..! బిజెపి పార్టీ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న నీకు బాధ కలగలేదు. వాళ్ళ యొక్క బాధను వ్యక్తం చేస్తూ న్యాయం కోసం పోరాడుతుంటే నీకు బాధ కలగలేదు. కనీసం వారికి సంఘీభావం కూడా తెలపలేదు. కానీ విద్యార్థులు తలుచుకుంటే ఏం జరుగుతుందో నీకు అర్థమై ఉంటుంది. ఒక కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేశాడంటే అర్థం చేసుకోవాలి. దేశాభివృద్ధి అనేది యువత మీద ఆధారపడి ఉంటుంది అలాంటి యువత తలుచుకుంటే రాజ్యాలే కూలిపోతాయి. ఈ బీజేపీ ప్రభుత్వం ఒక లెక్కా?. ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకొని ప్రజా సమస్యలపై, విద్యార్థుల సమస్యలపై పోరాడాలి అని బెజవాడి రవి అన్నారు.

# కేబుల్ ఛానళ్ళకు అక్రెడిటేషన్లు వెంటనే ఇవ్వాలి

- సమస్యను తక్షణమే పరిష్కరించాలి
- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** రాష్ట్రవ్యాప్తంగా కేబుల్ టీవీ న్యూస్ ఛానళ్ళలో పనిచేస్తున్న జర్నలిస్టులకు వెంటనే అక్రెడిటేషన్ కార్డులు జారీ చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆయన పలువురు ఫెడరేషన్ నాయకులతో కలిసి సచివాలయంలో రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ కమీషనర్ ముకుంద రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు.అక్రెడిటేషన్ల ప్రక్రియ ప్రారంభమై నాలుగైదు నెలలవుతున్నా,ఇంతవరకు అర్హులైన జర్నలిస్టులందరికి అక్రెడిటేషన్ కార్డులు అందలేదని, ముఖ్యంగా కేబుల్ ఛానళ్ళకు సంబందించిన జర్నలిస్టులకు ఒక్క కార్డు కూడా ఇవ్వలేదని మామిడి సోమయ్య అన్నారు. ఇప్పటివరకు అనేక కొర్రీలు పెట్టి కేబుల్ ఛానళ్ళ అక్రెడిటేషన్ కార్డుల సమస్యను పరిష్కరించలేదని, జిల్లాల్లో డీపీఆర్వోలు కేబుల్ ఛానల్ జర్నలిస్టులను ఇబ్బందులు పెడుతున్నారని ఆయన ఆరోపించారు. అన్ని అర్హతలున్న కేబుల్ ఛానళ్ళకు వెంటనే అక్రెడిటేషన్ కార్డులివ్వాలని, జిల్లా కేంద్రంలో స్టూడియో ఉండాలన్న నిబంధనను సడలిస్తూ సర్క్యులర్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎంఐబీ రిజిస్ట్రేషన్ తో ఐపీ బాక్స్ ల ద్వారా నడుస్తున్న అన్ని ఛానళ్ళకు కూడా అక్రెడిటేషన్ కార్డులివ్వాలని మామిడి సోమయ్య కోరారు. కేబుల్ ఛానళ్ళ అక్రెడిటేషన్ల సమస్య అతి త్వరలోనే పరిష్కారమవుతుందని స్పెషల్ కమీషనర్ ముకుంద రెడ్డి అన్నారు. కేబుల్ ఛానల్ జర్నలిస్టులందరికి న్యాయం జరిగేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నేషనల్ కౌన్సిల్ సభ్యుడు కుంచం శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి.రవికుమార్,కో-కన్వీనర్ ఆర్.శ్రీనివాస్ గౌడ్,కేబుల్ ఛానళ్ళ ప్రతినిధులు మహ్మద్ షఫీవుద్దీన్, జీవన్ కుమార్ గౌడ్, ఫారూఖ్ పటేల్,జూలూరు సత్యం గౌడ్ పాల్గొన్నారు.

# అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలి

- జిల్లా కలెక్టర్ కి టీజేఏ ఖమ్మం జిల్లా కమిటీ వినతి



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** అర్హులైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించాలని తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీజేఏ) ఖమ్మం జిల్లా అధ్యక్షులు జి నాగ స్వామి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్.కు వినతిపత్రం అంద చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.టీజేఏ జిల్లా అధ్యక్షులు నాగస్వామి మాట్లాడుతూ సమాజానికి సమాచారాన్ని అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టులకు సొంత ఇంటి కల నెరవేరేలా ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని అన్నారు.అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు వివక్ష లేకుండా ఇళ్ల స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.గత రెండు దశాబ్దాలుగా (20 ఏళ్లుగా) పరిష్కారానికి నోచుకోకుండా పెండింగ్‌లో ఉన్న అర్హులైన జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు అర్హులైన ప్రతి విలేకరికీ తక్షణమే ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. పెరుగుతున్న ధరల కాలంలో జర్నలిస్టులు ఇండ్ల అద్దెలు కట్టలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని టీజేఏ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు దశాబ్దాలుగా ఇళ్ల స్థలాల కోసం పోరాటం చేస్తున్నప్పటికీ జర్నలిస్టుల నిరీక్షణ ఇంకా కొనసాగుతూనే ఉందని పేర్కొన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ పారదర్శకంగా ఇళ్ల స్థలాలు కేటాయించి వారి కుటుంబాలకు నివాస ధీమా కల్పించాలని టిజేఏ ప్రతినిధులు ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని జిల్లా యంత్రాంగాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో టీజేఏ జిల్లా గౌరవ అధ్యక్షులు కొమ్మమూరు మణికుమార్ జిల్లా అధ్యక్షుడు జి. నాగస్వామి జిల్లా కార్యదర్శి మత్తి రామకృష్ణ జిల్లా నాయకులు సయ్యద్ ఖాసీం వాసం రాజేంద్ర ప్రసాద్ రాము రమేష్ సతీష్ సిహెచ్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కుల కోసం పోరాడేది ఏఐటీయూసీ

- జిల్లా ఏఐటీయూసీ మహా సభలను జయప్రదం చేయండి
- సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల




**చింతకాని ఆగస్టు 03ప్రజాజ్యోతి :** కార్మికుల హక్కుల కోసం పోరాడేది ఏఐటీయూసీ మాత్రమేనని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం చింతకాని మండల కేంద్రంలోని గంగవరపు విజయ్ కుమార్ భవన్లో నక్కన బోయిన కృష్ణ అధ్యక్షతన జరిగిన ఏఐటీయూసీ చింతకాని మండల 5వ మహానభలో జమ్ముల మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోడీ సర్కార్ నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చి కార్మికుల హక్కులు కాలరాస్తుందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలతో నడుస్తున్న ప్రభుత్వాలను ప్రశ్నించడానికి కార్మికులు ఏకమవ్వాలన్నారు. ఈ నెల 23, 24 వతేదీలలో సత్తుపల్లిలో జరిగే జిల్లా ఏఐటీయూసీ మహాసభలను జయప్రదం చేయాలన్నారు. సత్తువల్లి లాంటి కేంద్రంలో ఏఐటీయూసీ మహాసభలు జరగుతున్నాయని, ఈ మహానభలకు చింతకాని మండల వ్యాప్తంగా కార్మికులు హాజరై మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు మాట్లాడుతూ లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా పోరాడాల్సిందేనన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ లవల్ల కార్మిక వర్గం ఎనిమిది గంటల వని, కనీస వేతనాలు, సంఘ హక్కులు కోల్పోతున్నారన్నారు.శతాబ్ద కాలంగా కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక సంక్షేమ హక్కుల చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. సత్తువల్లిలో జరిగే జిల్లా మహానభలలో చింతకాని మండలంలోని అన్ని కార్మిక వర్గాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.అనంతరం ఏఐటీయూసీ చింతకాని మండల కన్వినర్ గా బండి పుల్లారావు, కోకన్వినర్ గా గోగుల వెంకట్రావు తో పాటు మరో 5గురు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రావి శివరామకృష్ణ సిపిఐ చింతకాని మండల కార్యదర్శి దూసరి గోపాల్ రావు ఏఐవైఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి బోళ్ళ భాను వర్కింగ్ ప్రెసిడెంట్ గోగుల వెంకన్న, నారపోగు సంపత్ కనకపుడి శంకర్ ఉమామహేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# నూతన విద్య విధానం రద్దుకు ఉద్యమిస్తాం ఏఐఎస్ఎఫ్



**కల్లూరు ఆగస్టు 03 : ప్రజా జ్యోతి** నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)ను రద్దు చేయాలని, విద్యార్థులు ఉద్యమాలకు సిద్ధం కావాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్ పిలుపునిచ్చారు. కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.మాట్లాడు తూ నూతన విద్య విధానం పేరుతో విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని దె బ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఉన్నత విద్య కార్పొరేటీకరణ ప్రవేటికరణ వాణిజ్యకరణ దిశగా నడిపిస్తున్నారని విమర్శించారు. విద్యరంగానికి కేంద్ర ప్రభుత్వం తగిన నిధులు కేటాయించకుండా నూతన విద్యా విధానాన్ని అమలు చేయడం సమంజసం కాదన్నారు. జిడిపిలో 6 శాతం కేంద్రం బడ్జెట్లో కనీసం 10% నిధులను విద్యకు కేటాయించాలని డి మాండ్ చేశారు. విశ్వవిద్యాలయాల్లో ఖాళీలను భర్తీ చేయకపోవడం ఫెలోషిప్ లు అందించకపోవడం ప్రజాస్వామ్య వాతావరణాన్ని దెబ్బతీయడం వంటి అంశాలపై విద్యార్థులు పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. నూతన విద్యా విధానంలో పేదలకు ఉచిత విద్యకు తగిన ప్రాధాన్యం కల్పించలేదని విమర్శించారు. పాఠ్యాంశాల్లో మార్పుల ద్వారా దేశ చరిత్ర వక్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైన విధానాలను ప్రభుత్వం అనుసరిస్తుందని ఆరోపించారు. అనంతరం కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏఐఎస్ఎఫ్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జి. రిషి వర్ధన్ కార్యదర్శిగా టీ. గ్రీష్మ సహాయ కార్యదర్శిగా పి. రఘు, ఉపాధ్యాయులుగా బి. మౌనిక, ఎం. హర్ష, కోశాధికారిగా ఆనంద్, ఎన్నికయ్యారు కమిటీ సభ్యులుగా ఎస్. సాయినాథ్, ఎం. ఉపేంద్ర, జస్వంత్, వివేక్, రాహుల్, ఉమాశంకర్, మణికంఠ, అనిత, ఉమా చంద్రిక, లహరి, బాల హర్షిత, మల్లికా, కావేరి, ఎన్నికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు వేము రాంబాబు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చెరువు పరిసరాల్లో వన మహోత్సవం



**రఘునాథపాలెం ప్రజా జ్యోతి** కోయాచెలక గ్రామ పంచాయతీ పరిధిలోని పర్యావరణ పరిరక్షణలో భాగంగా సోమవారం చెరువు కట్ట వద్ద వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి ఈత మొక్కలు నాటిన అధికారులు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, ఎక్సైజ్ ఎస్ఐ, గ్రామ కార్యదర్శి, గ్రామ కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు, మహిళా పోలీసు శాఖ అధికారులు పాల్గొని మొక్కలు నాటి, వాటి సంరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, "ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించడం ద్వారా పచ్చని పర్యావరణాన్ని భావితరాలకు అందిద్దాం" మొక్క నాటుదాం – ప్రకృతిని కాపాడుదాం, అని తెలిపారు.

## తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

**సత్తుపల్లి ఆగస్టు03(ప్రజా జ్యోతి )**తల్లిపాలతో బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంచుతాయని, తల్లిపాలు పోషక విలువలు కలిగిన అమృతమని సిడిపిఓ సత్యవతి అన్నారు. సోమవారం మండల పరిధిలోని కిష్టారం గ్రామంలో సూపర్వైజర్ రజిని ఆధ్వర్యంలో నిర్వహించిన, తల్లిపాల వారోత్సవాలలో సిడిపిఓ సత్యవతి హాజరైనారు. ఆమె మాట్లాడుతూ గర్భిణీగా గుర్తించిన దగ్గర్నుంచి, పోషక విలువలు కలిగిన ఆహారము, వ్యాధి నిరోధక టీకాలు , తప్పనిసరిగా తీసుకోవాలని, పుట్టబోయే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటాడని, సుఖ ప్రసవం అవుతారని అన్నారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా గర్భిణీలు ,బాలింతలు, చిన్నారులకు అంగన్వాడి కేంద్రాల ద్వారా అందించే పోషక విలువలు కలిగిన ఆహారం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు పట్టించాలని, ఆరు నెలల వరకు పాలు పట్టించాలని తల్లులకు వివరించారు. సర్పంచ్ నరకళ్ళ రాజేశ్వరి, ఏఎన్ఎం ఇషరత్ బేగం, ఎం ఎల్ హెచ్ పి, ప్రసన్న, అంగన్వాడి టీచర్లు ,ఆశ వర్కర్లు,తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.